సాక్షి పల్నాడు

ఆదివారం । 21 । సెప్టెంబర్ । 2025

I



భక్తి సంగీత విభావరి

నగరంపాలెం (గుంటూరు వెస్ట్) : బృందావన్ గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తి గీతాలాపన జరిగింది. పరమేశ్వరి, సాయిబాబు, పోతురాజు గీతాలను ఆలపించారు.



భక్తి శ్రద్ధలతో చండీహోమం

నగరంపాలెం(గుంటూరు వెస్ట్) : బృందావన్ గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించారు.

శివాలయంలో నందీశ్వరుడి పూజ



నాదెండ్ల: గణపవరం గంగా పార్వతీ సమేత సోమేశ్వరాలయంలో శనివారం నందీశ్వరుడి పూజ నిర్వహించారు. భక్తులు అభిషేకాలు జరిపించారు.

న్యూస్‌రీల్

దేవీ శరన్నవరాత్రుల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



నగరంపాలెం (గుంటూరు వెస్ట్) : ఈ నెల 22 నుంచి చుట్టుగుంట శ్రీ పోలేరమ్మ తల్లి దేవస్థానంలో 22వ దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. దేవస్థానంలో శనివారం మహోత్సవాల గోడప్రతులను కమిటీ సభ్యులతో కలసి ఆమె ఆవిష్కరించారు. వచ్చేనెల రెండో తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు అచ్చాల వెంకటరెడ్డి, అడకా పద్మావతి, తుమ్మల నాగేశ్వరరావు, కుమ్మర క్రాంతి కుమార్, అంగడి శ్రీనివాసరావు, అడకా శ్రీనివాసరావు, పెద్ద బుజ్జి పాల్గొన్నారు.

ప్రజా చైతన్యంలో ఎన్జీఓలదే కీలకపాత్ర

అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.సత్యశ్రీ



నరసరావుపేట టౌన్: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఎన్జీఓ సంఘాల ప్రతినిధులతో మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ ఎస్.సత్య శ్రీ శనివారం కోర్టు ప్రాంగణంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ మహిళలు, బాలికల అక్రమ రవాణా నిర్మూలనకు ఎన్జీఓలు అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యపరచాలన్నారు. సీనియర్ సిటిజన్లకు అన్ని విధాలైన సహాయ సహకారాలు అందించాలన్నారు. హెచ్ఐవీ నిర్మూలనకు, ట్రాన్స్‌జెండర్ల హక్కుల పరిరక్షణకు ఎన్జీవోలు తగు చర్యలు చేపట్టాలన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ ఎన్జీఓల ప్రతినిధులు హృదయ రాజు, మీరా, డేవిడ్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు. మొదట న్యాయమూర్తి ఎస్.సత్యశ్రీ ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనపై ఆరోగ్యశాఖ రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

గుంటూరులో భారీ వర్షం

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో శనివారం రాత్రి ఉరుములతో భారీ వర్షం కురిసింది. నగర ప్రజలు పలు ఇబ్బందులకు గురయ్యారు. లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. అరండల్‌పేటలో పైపులైను కోసం తవ్విన గుంతల పక్కన మట్టి రోడ్డుపైనే ఉండటంతో వర్షం నీటితో చిత్తడిగా మారింది. పలువురు పాదచారులు, వాహన చోదకులు జారిపడి గాయపడ్డారు. డొంకరోడ్డులో మూడు వంతెనల వద్ద వర్షపునీటితో రాపోకపోలకు అంతరాయం ఏర్పడింది. కంకరగుంట అండర్ పాస్ పూర్తిగా నీటి మయం కావడంతో అక్కడ భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి.

కార్తికేయుని సేవలో ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ డి.శ్రీహరిరావు, డాక్టర్ లీలా రమాదేవి దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న వారు తొలుత ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం పుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించారు. ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

అమ్మవారి ప్రతిష్ట తగ్గించేందుకే విజయవాడ ఉత్సవ్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువున్న కనకదుర్గమ్మ సన్నిధిలో జరిగే దసరా ఉత్సవాలను అపహాస్యం చేయటానికి, అమ్మవారి ప్రతిష్టను, ఖ్యాతిని తగ్గించడానికి కూటమి నేతలు విజయవాడ ఉత్సవ్ పేరుతో అడ్డగోలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు పోతిన మహేష్ శనివారం విమర్శించారు. విజయవాడ ఉత్సవ్ పేరుతో రూ.100 కోట్లు దోచుకోవడానికి ఎంపీ కేశినేని చిన్ని తదితర నేతలు పథకం పన్నారని దుయ్యబట్టారు.

పత్రికా స్వేచ్ఛను హరించటం సిగ్గుచేటు



ప్రభుత్వాలు, ప్రజలకు మధ్య వారధిగా నిలిచే పత్రికా స్వేచ్ఛను హరించటం సిగ్గుచేటు. ఏ మీడియాకు లేని ఆంక్షలు ఒక్క 'సాక్షి'కే ఎందుకు వర్తిస్తాయో కూటమి సర్కారు జవాబు చెప్పాలి. వాస్తవాలు రాస్తున్నారని ద్వేషమా? నిజాలు నిర్భయంగా వెల్లడిస్తున్నారనే ఆక్రోశంతో చంద్రబాబు, లోకేష్‌లు రగిలిపోతున్నారు. విలేకరుల సమావేశంలో కూటమి కుట్రల గురించి ప్రస్తావిస్తే.. 'సాక్షి'పై.. ఎడిటర్‌పై కేసులు కట్టడం ఎంతవరకు సమంజసం అనే విషయాన్ని ప్రజాస్వామ్యవాదులు, ప్రజలు ఆలోచించాలి. నిస్సిగ్గుగా మేం ఏం చేసినా అడిగేవాడు లేడన్న చందంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోంది. కేసులు పెట్టి కలాన్ని, పాత్రికేయులను నిలువరించలేరు. ఈ వాస్తవాన్ని కూటమి సర్కారు ఇప్పటికైనా గ్రహించాలి.

– పోలూరి వెంకటరెడ్డి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు



అక్రమ కేసులు దారుణం



ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, ప్రభుత్వ మోసాలను, వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తుందనే 'సాక్షి' ఎడిటర్, విలేకరులపై అక్రమంగా కేసులు పెట్టడం దారుణం. ప్రభుత్వ చర్యలు, తప్పులను పత్రికలు ఎత్తిచూపడాన్ని పాలకులు ఓర్చుకోలేకపోవడం సరికాదు. ఫోర్త్ ఎస్టేట్‌గా పిలవబడే మీడియాపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటనలు చేయడం కంటే నిరంకుశత్వం ఇంకేముంది? పోలీసు అధికారుల హక్కులను కాపాడేందుకే రాసిన కథనంపై 'సాక్షి'పై అక్రమ కేసు పెట్టడం విడ్డూరంగా వుంది. ప్రజాస్వామ్య పరిరక్షణకు, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తున్న మీడియా రంగాన్ని కూటమి ప్రభుత్వం అణిచివేసేలా చర్యలు చేపట్టడం సరికాదు. గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇలాంటి పరిస్థితులు లేవు.

– మున్నంగి వివేకానందరెడ్డి, నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు

మాచర్లలో అరాచక రాజ్యం

- 20 గ్రామాలకు చెందిన సుమారు 570 కుటుంబాలు ఊళ్లు వదలివెళ్లాయి
- సీఎం చంద్రబాబు రాకతో అయినా వారికి స్వేచ్ఛ వస్తుందని ఆశించాం..
- ఇప్పుడైనా వారికి స్వేచ్ఛగా బతికే అవకాశం కల్పించాలి
- మాచర్లలో పేదలకు రేషన్ బియ్యం దొరక్కుండా చేస్తున్నారు
- వరికపూడిశెల ఎప్పుడు పూర్తి చేస్తారో చెప్పలేకపోయారు
- వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

నియోజకవర్గం వేదికగా జూలకంటి కక్ష సాధింపులు



సాక్షి, నరసరావుపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచి మాచర్లలో అరాచకం రాజ్యమేలుతోందని, ప్రజలకు స్వేచ్ఛగా బతికే అవకాశం లేకుండా పోయిందని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత అభివృద్ధి, సంక్షేమాలను పక్కనపెట్టి తన కక్షసాధింపు చర్యలకు మాచర్లను వేదిక చేసుకున్నాడన్నారు. ఎన్నికల ఫలితాల తరువాత నియోజకవర్గంలోని 20 గ్రామాలకు చెందిన సుమారు 570 కుటుంబాలు ఊరు వదలి ఇతర ప్రాంతాల్లో తలదాచుకుంటున్నాయన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు రాకతో అయినా వారికి స్వేచ్ఛ వస్తుందని భావించానన్నారు. మాచర్లలో అప్రజాస్వామిక పోకడలపై అధికారులు సీఎంకు నివేదిక ఇచ్చి ఉంటారని, దానిపై స్పందించి ఆ 570 కుటుంబాలు తిరిగి గ్రామాలకు వచ్చేలా చేస్తారని ఆశిస్తున్నానన్నారు. వెళ్లిపోయిన వారిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీవర్గాలు ఉన్నాయని, వారికి స్వేచ్ఛగా బతికే అవకాశాలు కల్పించాలన్నారు.

వరికపూడిశెలపై ఒక్క ప్రకటనైనా లేదు

పల్నాడు ప్రజల చిరకాల కోరికైనా వరికపూడిశెల ప్రాజెక్టుకు అవసరమైన అన్ని అనుమతులను గత ప్రభుత్వంలో, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చారన్నారు. ఎంతో కీలకమైన పర్యావరణ, వన్యప్రాణ అనుమతులను కేంద్రంపై ఒత్తిడి తెచ్చి మరీ తీసుకువచ్చారన్నారు. మొదటి దశ పనులను ప్రారంభించామని, అయితే ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో పనులు ఆగిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రాజెక్టు పనులకు అవసరమైన నిధులను కేటాయించలేదన్నారు. సీఎం చంద్రబాబు పర్యటనలోనైనా ప్రాజెక్టు పనులకు అవసరమైన నిధులను విడుదల చేసి, పనులు ఎప్పటికి పూర్తి చేస్తారో చెబుతారని ఈ ప్రాంత ప్రజలు ఆశించారన్నారు. అయితే సీఎం ఆ దిశగా ప్రకటన చేయకపోవడం బాధాకరమన్నారు. 15 ఏళ్లకు పైగా సీఎంగా ఉన్న చంద్రబాబు వచ్చిన ప్రతిసారి ప్రకటనలు, శంకుస్థాపనలకే పరిమితమవుతున్నారన్నారు. చిత్తశుద్ధి ఉంటే నిధులు విడుదల చేసి, పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. వరికపూడిశెల పూర్తి చేసే సత్తా ఒక్క వైఎస్ జగన్‌కి మాత్రమే ఉందన్నారు.

దోచుకోవడం.. దాచుకోవడమే..

పేదలకు పంచాల్సిన రేషన్ బియ్యాన్ని మాచర్లలో కూటమి నేతలు అక్రమ రవాణా చేసి రూ.కోట్లు సంపాదిస్తున్నారన్నారు. బడుగు బలహీనవర్గాలకు తినడానికి ఒక్క కిలో రేషన్ బియ్యం కూడా ఇవ్వడం లేదన్నారు. మాచర్లలో జరుగుతున్న దుర్మార్గాలను సీఎం దృష్టికి తీసుకువచ్చేందుకు ఆ పార్టీ స్థానిక నేతలు శనివారం ప్రయత్నించినా అవకాశం దక్కకపోవడంతో నిరుత్సాహంలో ఉన్నారన్నారు. జూలకంటి అప్రజాస్వామిక పోకడలపై తెలుగుదేశం పార్టీ క్యాడరే రోడ్డుపై వచ్చే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. అక్రమ కేసులు, పీడీ యాక్టులు పెట్టడం, ప్రజలను దోచుకోవడం తప్ప బ్రహ్మరెడ్డి మాచర్లకు చేసిందేమి లేదన్నారు.

డయేరియా కేసులు @100

- తగ్గుముఖం పట్టని వ్యాధి
- కలుషిత నీరు కాదంటూ కమిషనర్ ప్రకటన
- నీటి వల్లే అంటున్న వైద్యులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు : గుంటూరులో డయేరియా కేసులు సెంచరీకి చేరువలో ఉన్నాయి. తగ్గుముఖం పట్టకపోగా రోజ రోజుకీ పెరుగుతుండటంతో ప్రజల్ని ఆందోళనకు గురి చేస్తోంది. శనివారం ఉదయానికి జీజీహెచ్‌లో బాధితుల సంఖ్య 92కు చేరింది. సమస్య పరిష్కారానికి కృషి చేయకుండా అధికారులు పొంతన లేని ప్రకటనలు చేస్తున్నారు. కలుషిత నీరు కాదు, కలుషిత ఆహారం వల్లే సమస్య ఏర్పడిందంటూ కమిషనర్ డయేరియా వెలుగు చూసిన రోజే ప్రకటన చేయడం వివాదాస్పదంగా మారింది. జీజీహెచ్ వైద్యులు మాత్రం కలుషిత నీటి వల్లే ఈ సమస్య ఏర్పడిందని స్పష్టంగా చెబుతున్నారు.

బాధితులు సంఖ్య బయటపెట్టని అధికారులు

జీజీహెచ్‌కి వచ్చిన కేసులను కూడా పూర్తిగా బయటపెట్టకపోవడం అనుమానాలకు తావిస్తోంది. మరోవైపు ప్రైవేటు ఆసుపత్రులకు, ఆర్ఎంపీల వద్దకు వెళుతున్న వారు, ఇంటి వద్దనే వైద్యం తీసుకుంటున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉన్నట్లు సమాచారం. అయితే ఈ విషయాలను వెల్లడించకుండా కేసుల సంఖ్యను తక్కువ చేసి చూపిస్తున్నారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా జీజీహెచ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అతిసార, ఇతర బాధితులను పరామర్శించారు. వైద్య సిబ్బంది సందర్శనలు, స్థానికుల తాగు నీటి వసతులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వైద్యాధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.



ఆనందపేట 3వ లైనులో కాలువ పక్కనే ఉన్న పైపులైన్లు

నగర ప్రజల్లో ఆందోళన

2018లో ఆనందపేటతో పాటు పలు ప్రాంతాల్లో ఇదే విధంగా డయేరియాతో 30 మంది వరకూ మరణించడంతో నగర ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గుంటూరు నగరంలోని 57 డివిజన్లలో పలు ప్రాంతాల్లో ఇంటింటికీ సరఫరా అయ్యే తాగునీటి పైపులైన్లు మురుగు కాలువల్లోనే దర్శనమిస్తున్నాయి. మరికొన్ని మురుగు కాలువను అనుకొని వెళుతున్నాయి. వర్షం కురిస్తే చాలు పొంగి వాటర్ పైపులైన్లన్నీ కూడా మునిగిపోతున్నాయి. పైపుల్లోకి మురుగు నీరు చేరుతుందని నగరంలోని రామిరెడ్డితోట, ఆనందపేట, దుర్గానగర్, యానాదికాలనీ, తదితర ప్రాంతవాసులు చెబుతున్నారు.

ఫణిదంలో దారుణం

- కుటుంబాన్ని బలిగొన్న రుణలావాదేవీలు
- ఈనెల 17న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు బలవన్మరణానికి యత్నం
- బావిలో దూకి అదేరోజు భార్య, కుమారుడు మృత్యువాత
- పురుగుల మందు తాగిన ఇంటి యజమాని మృత్యువుతో పోరాడుతూ శుక్రవారం రాత్రి మృతి

సత్తెనపల్లి: అప్పు తిరిగి చెల్లించే విషయంలో జరిగిన వివాదంలో అప్పు తీసుకున్న వ్యక్తి పురుగుల మందు తాగి బలవన్మరణానికి యత్నించి.. ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో.. ఆ వివాదానికి కారణం తామేనని చెబుతాడనే ఆలోచనలతో రుణదాత కుటుంబం ఆత్మహత్యకు యత్నించడం అందులో తల్లీ కుమారులు నేలబావిలో దూకి చనిపోవడం, రుణదాత పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం చేయడం.. ఈనెల 17న సత్తెనపల్లి మండలం ఫణిదం గ్రామంలో జరిగిన ఈ సంఘటన జిల్లాలో సంచలనంగా మారిన విషయం పాఠక విధితమే. అయితే పురుగుమందు తాగి చికిత్సపొందుతూ రుణదాత సైతం చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు.



చికిత్స పొందుతూ మృతిచెందిన శ్రీనివాసరావు

గ్రామంలో విషాద ఛాయలు

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు రోజుల వ్యవధిలోనే మృత్యువాత పడటంతో ఫణిదం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తమ కుటుంబం మొత్తం దూరమవ్వడంతో శ్రీనివాసరావు కుమార్తె వెంకట జ్యోతి గుండెలవిసేలా రోదిస్తోంది. ఆమె రోదన చూపరులను సైతం కంటతడికి గురి చేస్తోంది. శ్రీనివాసరావు మృతదేహానికి సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో శనివారం పోస్టుమార్టం నిర్వహించారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అసలేం జరిగింది..

సత్తెనపల్లి మండలం ఫణిదం గ్రామానికి చెందిన రామనాథం శ్రీనివాసరావు (52), రామనాథం పూర్ణకుమారి(47) భార్యాభర్తలు. వీరికి కుమార్తె వెంకట జ్యోతి, కుమారుడు వెంకటేశ్వర్లు(23) ఉన్నారు. శ్రీనివాసరావు ఫణిదం గ్రామానికే చెందిన మరో కౌలు రైతు దాసరి వెంకట్రావుకు కొంత నగదు అప్పుగా ఇచ్చాడు. వెంకట్రావు కొంత చెల్లించి, మరికొంత చెల్లించాల్సి ఉండడం, తాను మాటసాయంగా ఇప్పించిన పొలం తాలూకా కౌలును సైతం సరిగా కట్టని కారణంగా దాసరి వెంకట్రావుకు శ్రీనివాసరావుకు మధ్య వివాదం జరిగింది. దీంతో అప్పు తీసుకున్న వెంకట్రావు మనస్థాపం చెంది ఈ నెల 16న పురుగుల మందు తాగి బలవన్మరణానికి యత్నించి, గుంటూరులో చికిత్స పొందుతున్నాడు. అయితే వివాదానికి కారణం తామేనని చెబుతాడనే ఆలోచనతో శ్రీనివాసరావు కుటుంబం కేసులు, జైలుపాలు కావాల్సి వస్తుందేమోననే తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఈక్రమంలో భార్య పూర్ణకుమారి, కుమారుడు వెంకటేశ్వర్లు ఈ నెల 17న పొలంలోని నేలబావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. భార్య, కుమారుడు మృతితో తీవ్ర మనస్థాపానికి గురైన శ్రీనివాసరావు కూడా అదే రోజు పురుగులమందు తాగి బలవన్మరణానికి యత్నించగా హుటాహుటిన శ్రీనివాసరావును సత్తెనపల్లిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృత్యువుతో పోరాడుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు.

పేకాటలో తమ్ముళ్ల కాసుల వేట

- అనధికారికంగా క్లబ్బుల నిర్వహణ
- భారీగా జేబులు నింపుకొంటున్న నేతలు
- బార్‌లలోనూ కొనసాగుతున్న క్లబ్బులు
- వారానికే రూ. కోట్లల్లో టర్నోవర్
- నాయకుల ధన దాహానికి విస్తరిస్తున్న విష సంస్కృతి
- కోరిన మద్యం, మాంసాహార వంటకాలు ఏర్పాటు
- తెలంగాణ నుంచి వచ్చిన వారికి మరిన్ని మర్యాదలు
- కమీషన్ ఇస్తే చాలని కనీసం అటువైపు చూడని పోలీసులు
- పాలకుల వైఖరితో సామాన్యుల జేబులు గుల్ల

"రండి బాబు రండి.... అనువైన చోటు.. తిండి, మద్యం బాధ్యత మాదే! కేవలం డబ్బు తెచ్చుకుంటే చాలు... అది కష్టం అనుకుంటే ఫోన్ పే, గూగుల్ పే అయినా ఓకే. ఇన్నాళ్లు మీరు ఈ అదృష్టానికి దూరమయ్యారు. ఈ ఆనందం కోసం ఇప్పుడు మన రాష్ట్రం దాటవలసిన పనిలేదు. పక్క రాష్ట్రం వారు కూడా మన శిబిరం వద్దకే వస్తున్నారు. రండి.. మీ భద్రతకు మాదే పూచీ. మీకు ఏం కావాలన్నా తెచ్చి పెట్టడానికి చేతి కింద ఎంతోమంది జాకీలు సిద్ధం. మీరు డబ్బులు గెలుచుకోవాలేగానీ 'క్వీన్' కూడా రెడీ. పైన కింగ్ 'మనోడే'. ఇంకెందుకు ఆలోచిస్తారు... జోకర్ పడకపోయినా కూడా షో చెప్పవచ్చు. ట్రిపులెట్‌లా మీ జీవితం వెలిగిపోవచ్చు...." అంటూ రాష్ట్రంలో పేకాడే వాళ్లను అధికార కూటమి నేతలు పల్నాడు జిల్లాకు ఆహ్వానిస్తున్నారు.



బ్రాహ్మణపల్లిలో టీడీపీ నాయకుడి వివేర రెస్టారెంట్లో పేకాట ఆడుతున్న వారిని పట్టుకున్న పోలీసులు (ఫైల్)

సాక్షి టాస్క్ ఫోర్స్: ఎన్నో కుటుంబాలను ఛిద్రం చేసిన చరిత్ర జూదానిది. పండగలు, పబ్బాలకు జరిగే జూదంతోనే ఎందరో ఆస్తుల అమ్ముకుంటున్నారు. పేకాట వల్ల గతంలో ఎన్నో వేల కుటుంబాలు అప్పుల బారిన పడ్డాయి. ఎంతోమంది ఐపీ పెట్టారు. ఇదంతా ప్రభుత్వ పెద్దలకు తెలియని విషయం కాదు.

కూటమి ప్రభుత్వం వచ్చీరాగానే రాష్ట్రంలో సామాన్యుల బతుకులతో పేకాడేస్తోంది. కూటమి ప్రజాప్రతినిధుల సహకారంతో నాయకులు మూడు ముక్కలు...ఆరు ఆటలుగా.. పేకాట దందా నిర్వహిస్తున్నారు. యథేచ్ఛగా క్లబ్బులు తెరిచి అందినకాడికి జేబులు నింపుకొంటున్నారు. పల్నాడు జిల్లాలోని గురజాల, మాచర్ల, వినుకొండ నియోజకవర్గాలు తెలంగాణ రాష్ట్రానికి సరిహద్దుగా ఉన్నాయి. దీంతో తెలంగాణ నుంచి భారీ ఎత్తున పేకాటరాయుళ్లు రోజూ వందల మంది పల్నాడు జిల్లాలో ఆడేందుకు వస్తున్నారు. అంతే కాకుండా బందరు, పశ్చిమగోదావరి, ఈస్ట్ గోదావరి ప్రాంతాల వారూ ఇక్కడికి వస్తున్నారు.

పలు ప్రాంతాల్లో నిర్వహణ

గురజాల నియోజకవర్గంలోని దాచేపల్లి, పిడుగురాళ్ల పట్టణ శివారు ప్రాంతాల్లో గ్రామాల్లో, మాచర్ల నియోజకవర్గంలోనే కారంపూడి, మాచర్ల పట్టణంలో, వినుకొండ నియోజవర్గంలోని వినుకొండ పట్టణం, ఈపూరు మండలంలో, పెదకూరపాడు నియోజకవర్గంలో అమరావతిలో భారీగా పేకాట క్లబ్బులు నిర్వహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం నల్గొండ, మిర్యాలగూడెం ప్రాంతాల నుంచి పేకాట ఆడేందుకు పదుల సంఖ్యలో కార్లు వేసుకొని వందల మంది నిత్యం వస్తున్నారు. పల్నాడు జిల్లాలో గురజాల నియోజవర్గం పిడుగురాళ్ల మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకుడికి చెందిన రెస్టారెంట్‌లో తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడెంకి చెందిన వారిని పేకాట ఆడుతుండగా పోలీసులు పట్టుకున్నారు. అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. అదే తరహాలో బ్రాహ్మణపల్లి గ్రామంలో కోళ్ల ఫారంలో 36 మందిని పేకాట ఆడుతున్నప్పుడు పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి సుమారుగా రూ.76 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. కానీ కూటమి నాయకుల ఒత్తిడితో పోలీసులు వారిని వదిలిపెట్టారా? అనేది చర్చనీయాంశంగా మారింది.

అర్ధరాత్రి వేళ బార్‌లో కూడా...

బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యం అమ్మకాలు చేయాలి. ఉదయం 10 గంటల నుంచి అర్ధరాత్రి వరకు బార్లు ఉంటాయి. గురజాల, మాచర్ల, వినుకొండ నియోజకవర్గాలలో అర్ధరాత్రి ఐతే చాలు బార్‌లు పేకాట నిలయాలుగా మారాయి. పేకాట టేబుళ్లకల నిర్వహిస్తున్నారు. ఒక్కొక్క టేబుల్‌కు రూ. లక్షల్లో ఆట కొనసాగుతోంది. ఈ విషయం పోలీసులకూ తెలుసని, కమీషన్ ఇస్తుండటంతో అటువైపు చూడడం లేదని సమాచారం. తెలుగు తమ్ముళ్లు నిత్యం ఎక్కడో ఒక చోట పేకాట ఆడిస్తూ జేబులు నింపుకొటున్నారు. ఆడే వారి జేబులు గుల్లవుతున్నాయి. నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన పల్నాడు జిల్లా ఎస్పీ కృష్ణారావు దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని పల్నాడు ప్రజలు ఎదురు చూస్తున్నారు.

యువకుడిపై కత్తితో దాడి

- పరిస్థితి విషమం
- పుట్టిన రోజు వేడుకల్లో శ్రుతిమించిన వివాదం
- ఇరువురిపై కేసు నమోదు

చేబ్రోలు: పుట్టిన రోజు వేడుకల్లో స్వల్ప వివాదం జరిగి ఆవేశంలో కత్తితో దాడి చేయడంతో యువకుడి పరిస్థితి విషమంగా ఉన్న సంఘటన చేబ్రోలు మండలం నారాకోడూరులో శనివారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామానికి చెందిన యువకుడు దానబోయిన మురళి పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం అర్ధరాత్రి పార్టీ ఏర్పాటు చేశాడు. డీజే, డాన్స్ , భోజనాలను ఏర్పాటు చేశాడు. నారాకోడూరు, పరిసర గ్రామాలకు చెందిన మురళి మిత్ర బృందం హాజరయ్యారు. డ్యాన్స్ సందర్భంగా అర్ధరాత్రి సమయంలో మద్యం మత్తులో యువకుల మధ్య వివాదం రేగింది. దీన్ని మనసులో పెట్టుకొని శ్రీకర్, వరుణ్‌లు వేజండ్ల గ్రామానికి చెందిన తోట గౌతమ్ కృష్ణపై కత్తితో ఛాతీపై పొడవటంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని వడ్లమూడిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. గౌతమ్ కృష్ణ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. బాధితుడి తల్లి శ్రీలక్ష్మి ఫిర్యాదు మేరకు చేబ్రోలు ఎస్ఐ పి. వీరనారాయణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దసరా ఉత్సవాల ఏర్పాట్లు పూర్తి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సామాన్య భక్తులకు పెద్ద పీట వేస్తూ ఈ ఏడాది దసరా ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లూ పూర్తిచేశామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభమయ్యే దసరా ఉత్సవాల ఏర్పాట్లపై మహా మండపం ఆరో అంతస్తులో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు, మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, దుర్గగుడి ఈఓ శీనానాయక్ హాజరయ్యారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ.. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేశామన్నారు. సామాన్య భక్తుల రద్దీ తక్కువగా ఉండే సమయంలోనే వీఐపీ దర్శనాలను స్లాట్లు నిర్ణయించామన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో 500 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటి పర్యవేక్షణకు ప్రతి ప్రభుత్వ శాఖ నుంచి ఒక అధికారి చొప్పున నియమించామని తెలిపారు. క్యూలైన్లలో రద్దీని ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు ఏఐ టెక్నాలజీని వినియోగిస్తామన్నారు. ఈ ఉత్సవాలకు 20 లక్షల మంది భక్తులు విచ్చేస్తారని అంచనా వేశామని వివరించారు.



ఉత్సవాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, సీపీ, నగర కమిషనర్ తదితరులు

క్లుప్తంగా

కంకణాలపల్లి రైతు సేవా కేంద్రానికి తాళాలు

సత్తెనపల్లి: రైతు సేవా కేంద్రానికి టీడీపీ సానుభూతి పరులు ఒకరు తాళాలు వేయగా .. మరొకరు తాళాలు పగలగొట్టిన సంఘటన శనివారం వెలుగు చూసింది. వివరాలు ఇలా.. యూరియా కోసం రైతులు గత కొద్దిరోజులుగా క్యూ కడుతున్నారు. ఈ క్రమంలో సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి రైతు సేవ కేంద్రానికి 19.8 మెట్రిక్ టన్నులు (440 బస్తాలు) యూరియా రావడంతో దానిని కంకణాలపల్లి, బట్లూరు గ్రామాలకు చెందిన రైతులకు పంపిణీ చేయాల్సి ఉంది. వ్యవసాయ శాఖ అధికారులు కొంత పంపిణీ చేసి, మిగిలిన దానిని భట్లూరుకు పంపాలనే యోచనలో ఉన్నారు. రైతు సేవాకేంద్రానికి గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతిపరుడు బొడ్డు వెంకటేశ్వరరావు శుక్రవారం రాత్రి తాళాలు వేశాడు. శనివారం యూరియా పంపిణీ చేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులు రైతు సేవా కేంద్రం వద్దకు చేరుకోగా అధికారులు వేసిన తాళాలకు తోడు మరో తాళం వేసి ఉండడంతో ఆశ్చర్యపోయారు. అప్పటికే అక్కడికి చేరుకున్న టీడీపీ మరో వర్గానికి చెందిన కిలారి వేణు వచ్చి గ్రామ వ్యవసాయ అధికారి బాబు సమక్షంలో గడ్డపారతో తాళాన్ని పగలగొట్టగా మరో తాళాన్ని అధికారులు తీసినట్లు తెలిసింది. దీంతో ఎరువులు పంపిణీ చేపట్టే క్రమంలో వేంకటేశ్వరరావు, వేణుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.ఆ సమయంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ దృష్టికి తీసుకు వెళ్లడంతో ప్రభుత్వానికి చెందిన రైతు సేవా కేంద్రానికి తాళం వేయడం ఏంటని మండిపడినట్లు సమాచారం. పోలీసులకు అధికారులు ఫిర్యాదు చేయగా వెంకటేశ్వరరావును అదుపులోకి తీసుకున్నారు. దీంతో టీడీపీ నాయకులు రంగ ప్రవేశం చేసి ఇరు వర్గాలకు హెచ్చరికలు చేసి సర్దుబాటు చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది.

ఇలాగైతే కష్టం 'మర్రి'?

- మర్రి రాజశేఖర్ చేరికపై తెలుగు తమ్ముళ్ల గుర్రు
- పార్టీ సభ్యత్వాలకు పలువురు నాయకుల రాజీనామా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాదెండ్ల మండల అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ తదితరులు

నరసరావుపేట: ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ తెలుగుదేశం పార్టీలో చేరడంపై ఆ పార్టీ నాదెండ్ల మండల నాయకులు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తూ శనివారం తమ పదవులు, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్‌కు తమ రాజీనామా లేఖలు పంపారు. ఈ సందర్భంగా సాతులూరులోని టీడీపీ మండల కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ తన వర్గీయులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ముప్పై ఏళ్లుగా టీడీపీలో వివిధ బాధ్యతలు, ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రజలకు సేవ చేసిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకు కనీసం మాటమాత్రం తెలియపరచకుండా మర్రి రాజశేఖర్‌ను పార్టీలోకి ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో మర్రి రాజశేఖర్ తమపై తప్పుడు కేసులు పెట్టించటమే కాక ఆర్థికంగా నష్టపోయేలా చేశారంటూ ఆరోపించారు. మాజీ మంత్రి విడదల రజినికి చిలకలూరిపేట ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వటంతో ఆపార్టీలో తనకు విలువ లేకపోవటంతోనే టీడీపీలో చేరాడని విమర్శించారు. టీడీపీలో మర్రి చేరికతో పార్టీ కోసం కష్టపడిన తమకు విలువ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ అభిప్రాయాలు తీసుకోకుండా ఆయన్ను పార్టీలోకి తీసుకోవటంతో తాము టీడీపీని వీడుతున్నామని పేర్కొన్నారు.

కూటమి ప్రైవేటీకరణ విధానాలను అడ్డుకుంటాం

- ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కాపాడుకుంటాం
- సోషల్ యాక్టివిస్టుల ప్రకటన



పిడుగురాళ్ల మెడికల్ కళాశాల ముందు సోషల్ యాక్టివిస్టులు

నరసరావుపేట: వైఎస్సార్‌సీపీ ఇచ్చిన పిలుపు మేరకు పిడుగురాళ్లలోని మెడికల్ కళాశాలను గాంధీ స్మారక సమితి వ్యవస్థాపకులు ఈదర గోపీచంద్, ఇంగ్లిష్ మీడియం పరిరక్షణ వేదిక కన్వీనర్ డి.ఏడుకొండలు శుక్రవారం సందర్శించారు. ఈ మేరకు ఫొటోలు, వివరాలను మీడియాకు వారు శనివారం విడుదల చేశారు. నాలుగు చోట్ల ఉన్న పోలీస్ చెక్‌పోస్టులను చాకచక్యంగా దాటి, హైవే పక్కన ఉన్న మెడికల్ కాలేజీ ముందుకు వెళ్లి సెల్ఫీ దిగామన్నారు. పేద ప్రజలు, పేద వైద్యవిద్యార్థుల మీద వాత్సల్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రాత్మకంగా తీసుకొచ్చిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు అమ్మే దుశ్చర్యను కూటమి ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలియచేశామన్నారు. పలువురు నిరసనకారులను అక్కడి పోలీసులు కళాశాలలోకి వెళ్లకుండా అడ్డుకొని చెదరగొట్టటమే కాక, వెంటబడి పట్టుకుని వ్యాన్ ఎక్కించి పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లారన్నారు. ప్రభుత్వ దౌర్జన్యాన్ని ఖండించారు. మెడికల్ కళాశాల ఆవరణలోకి వెళ్లి జగన్ చేయించిన అద్భుత నిర్మాణాన్ని వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ యువనేత నాగార్జున యాదవ్‌పైన, అమరావతిలో శాసనమండలి సభ్యుల నిరసన ప్రదర్శనను కవర్ చేస్తున్న సాక్షి మీడియా ఇన్‌పుట్ ఎడిటర్‌పై పోలీసులు దౌర్జన్యం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజల నిరసనను కూటమి ప్రభుత్వం ఎంతోకాలం అణచలేదని తెలిపారు. వీటికి భయపడకుండా, మరిన్ని పోరాటాలలో పాల్గొంటామని వారు స్పష్టం చేశారు.

చేబ్రోలులో అత్యధికంగా 84 మి.మీ. వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు అత్యధికంగా చేబ్రోలు మండలంలో 84 మిల్లీ మీటర్ల వర్షం పడగా, అత్యల్పంగా మంగళగిరి మండలంలో 0.8 మి.మీ పడింది. సగటున 23.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. పెదనందిపాడు మండలంలో 68.4 మి.మీ., తాడికొండ 34, ఫిరంగిపురం 32.6, వట్టిచెరుకూరు 30.6, గుంటూరు పశ్చిమ 29.4, కాకుమాను 29.4, గుంటూరు తూర్పు 26.4, ప్రత్తిపాడు 26.4, పొన్నూరు 20, పెదకాకాని 14.2, తుళ్లూరు 10.6, మేడికొండూరు 8.8, తెనాలి మండలంలో 3.8 మి.మీ. చొప్పున వర్షం పడింది. సెప్టెంబర్ 20వ తేదీ నాటికి జిల్లాలో సాధారణ వర్షపాతం 106.3 మి.మీ పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 180.8 మి.మీ నమోదైంది.

చేనేతను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు



మాట్లాడుతున్న పిల్లలమర్రి బాలకృష్ణ

సత్తెనపల్లి: చేనేత రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ ఆరోపించారు. ఈ రంగాన్ని పరిరక్షించేందుకు ఉద్యమ కార్యచరణను రూపొందిస్తామని అన్నారు. సత్తెనపల్లిలోని పణిదం చేనేత సొసైటీ కాలనీలో శనివారం జరిగిన సంఘం పల్నాడు జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు కట్టా శివదుర్గారావు అధ్యక్షత వహించారు. బాలకృష్ణ మాట్లాడుతూ... అక్టోబర్ 6, 7వ తేదీలలో సత్తెనపల్లిలో సంఘం 11వ రాష్ట్ర మహాసభలలో పోరాట కార్యాచరణను రూపొందిస్తామన్నారు. సమావేశంలో వృత్తి సంఘాల రాష్ట్ర కన్వీనర్ భాస్కరయ్య, జిల్లా కార్యదర్శి అనుముల వీరబ్రహ్మం, జిల్లా కమిటీ సభ్యులు గడ్డం సుస్సులోవ్, పి ప్రభాకర్, బిట్ర పానకాలు, వలపర్ల చిన్న దిబ్బయ్య, మల్లాల గురవయ్య, మోపర్తి బాబు రాజు, గరికపూడి ఏసురత్నం పాల్గొన్నారు.

28న క్లెసా జిల్లా స్థాయి సమావేశం

నరసరావుపేట: కాన్ఫడరేషన్ ఆఫ్ లైసెన్స్‌డు ఇంజినీర్లు, సర్వేయర్లు, ఆర్కిటెక్ట్స్ ఆఫ్ పల్నాడు (క్లెసా - పల్నాడు) జిల్లా నూతన కార్యవర్గం ఈ నెల 28వ తేదీన పెద్దచెరువులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) భవనంలో సమావేశం కానుందని సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కె.కమలాకరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంఘంలో చేరి అభివృద్ధి కోసం కృషి చేయాలనే ఉద్దేశంతో ఉన్న వారందరూ హాజరుకావాలని కోరారు. రాష్ట్ర నాయకులు ముఖ్యఅతిథులుగా పాల్గొని భవిష్యత్ కార్యక్రమాలపై చర్చిస్తారన్నారు. జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక ఉంటుందన్నారు. సమావేశం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు.

పిడుగురాళ్లలో 43 మందిపై కేసు

పిడుగురాళ్ల: చలో మెడికల్ కాలేజీ కార్యక్రమంలో భాగంగా పిడుగురాళ్ల మెడికల్ కళాశాల వద్దకు వెళ్లిన 43 మందికి పైగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై పిడుగురాళ్ల పోలీసులు కేసులు నమోదు చేశారు. ముందస్తు జాగ్రత్తలలో భాగంగా ఇటువంటి కార్యక్రమాలప్పుడు లా అండ్ ఆర్డర్ ఇబ్బంది లేకుండా వారిని అదుపులోకి తీసుకొని, సొంత పూచీకత్తుపై పంపించినట్లు పోలీసులు తెలిపారు.

హెల్త్ ఆన్ వీల్స్ రైలులో రెండవ విడత వైద్య పరీక్షలు



లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణను దృష్టిలో పెట్టుకుని రెండవ విడత హెల్త్ ఆన్ వీల్స్‌లో వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పీఆర్వో డి.వినయ్‌కాంత్ తెలిపారు. శనివారం గుంటూరు–దొనకొండ రైల్వే స్టేషన్ల మార్గంలో ఉద్యోగులకు రెండవ విడత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్‌కాంత్ మాట్లాడుతూ ఈనెల 13న కార్యక్రమాన్ని డీఆర్ఎం సుదేష్ణ సేన్ ప్రారంభించినట్లు తెలిపారు. మొదటి రోజు గుంటూరు– రేపల్లె మార్గంలో నిర్వహించినట్లు పేర్కొన్నారు. మొబైల్ మెడికల్ యూనిట్‌లో గుంటూరు చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్. శ్రీనివాసు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.సింధు, లలిత, ఒమేగా హాస్పిటల్స్‌తో పాటు శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు కలిసి పరీక్షలు నిర్వహించారని తెలిపారు. రైల్వే ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులకు కూడా వైద్య పరీక్షలు నిర్వహించారని తెలియజేశారు. డీఎంఓ గుంటూరు డాక్టర్ ప్రియాంక, డీఎంఓ దొనకొండ డాక్టర్ ప్రకాశ్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విభాగాల్లో పలువురు నియామకం



నరసరావుపేట: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన పలువురు నాయకులను రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలలో వివిధ హోదాల్లో నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు విద్యార్థి విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా ఉప్పుతోళ్ల వేణుమాధవ్ (నరసరావుపేట), షేక్ మాబూహుస్సేన్ (సత్తెనపల్లి) నియమితులయ్యారు. అలాగే రాష్ట్ర మైనార్టీ సెల్ సెక్రటరీగా సత్తెనపల్లికి చెందిన షేక్‌జాని (గుంటూరు జాని), స్టేట్ సోషల్ మీడియా వింగ్ సంయుక్త కార్యదర్శిగా తంగిరాల శ్రీనివాసరెడ్డి (మాచర్ల), స్టేట్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా కందుల ఎజ్రా (నరసరావుపేట), స్టేట్ వలంటీర్ వింగ్ సంయుక్త కార్యదర్శిగా పండ్ల మంగయ్య (మాచర్ల) నియమితులయ్యారు.

బాలికను వేధించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

తాడికొండ: బాలికను వేధిస్తున్న యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు తాడికొండ సీఐ సీహెచ్.వాసు శనివారం తెలిపారు. తాడికొండకు చెందిన యువతి గుంటూరులోని ఓ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. గత పది నెలలుగా తాడికొండ గ్రామానికి చెందిన షేక్ అస్లామ్ యువతి కళాశాలకు వెళుతున్న సమయంలో వెంటబడుతున్నాడు. తనను ప్రేమించాలంటూ బలవంతం చేస్తూ లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడు. యువతి విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపింది. ఆమె తాతయ్య నిందితుడిని హెచ్చరించాడు. రెచ్చిపోయిన యువకుడు ఫోన్ చేసి తన ప్రేమను అంగీకరించకపోతే యువతితో పాటు ఆయన్ను చంపుతానని బెదిరించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ వాసు తెలిపారు.


గంజాయి రహిత జిల్లాగా చేయడమే లక్ష్యం

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

నగరంపాలెం: జిల్లాను గంజాయి రహితంగా చేయడమే లక్ష్యమని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గంజాయి క్రయ, విక్రయాలు, సరఫరాపై కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. గడచిన రెండు రోజుల్లో 3.5 కిలోల గంజాయి సీజ్ చేసి, 22 మందిని అరెస్ట్ చేశామని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీలు, అవగాహన కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. గంజాయి కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై ప్రత్యేక నిఘాతో పాటు పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని, ఆస్తుల జప్తునకు కూడా చర్యలు చేపడతామని వివరించారు. పోలీస్‌స్టేషన్ స్థాయిలోని ప్రత్యేక పోలీస్ బృందాలు, ఈగల్ బృందాల సమన్వయంతో గంజాయి నిర్మూలిస్తామ డ్రోన్ కెమెరాల సాయంతోనూ గుర్తిస్తామని తెలిపారు. జిల్లాలో చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని ఎస్పీ స్పష్టం చేశారు.

శలపాడులో దెబ్బతిన్న పంట పొలాల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్



పొలాలను పరిశీలిస్తున్న ఏవో ప్రియదర్శిని తదితరులు

చేబ్రోలు: భారీ వర్షాలు, వరదలకు మండలంలోని శలపాడు, వీరనాయకుని పాలెం గ్రామాల్లో నీట మునిగి దెబ్బతిన్న వరి పొలాలను శనివారం వ్యవసాయశాఖాధికారులు పరిశీలించారు. సాక్షి దినపత్రికలో శనివారం ప్రచురితమైన ''రెక్కల కష్టం... వర్షార్పణం'' కథనానికి అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా స్థానిక ఏవో పి. ప్రియదర్శిని మాట్లాడుతూ శేకూరు, శలపాడు రెవెన్యూ గ్రామాల పరిధిలో రైతులు నాలుగు వేల ఎకరాల్లో వరి సాగు చేశారని తెలిపారు. పంట కూడా 30రోజులు పైబడిన దశలో ఉందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిల్వ ఉన్న పొలాలను పరిశీలించామని, ప్రాథమిక నివేదికను జిల్లా వ్యవసాయశాఖాధికారికి సమర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యయసాయశాఖ సిబ్బంది, మైలా రామరాజు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

జిమ్నాస్టిక్స్ జిల్లా టీం ఎంపిక



గుంటూరు వెస్ట్: బీఆర్ స్టేడియంలో శనివారం అండర్– 14, అండర్– 17, అండర్– 19 జిమ్నాస్టిక్స్ బాలబాలికల జిల్లా టీం సెలక్షన్లు నిర్వహించారు. అండర్– 14, 17 ఎంపికలు ఎస్జీఎఫ్ సెక్రటరీ గోపి, అండర్ –19 ఎంపికలు నరసింహారావు, కోచ్ అఫ్రోజ్ ఖాన్ ఆధ్వర్యంలో జరిగాయి.